'కాను'

చౌను తిరగ్గానే పెద్ద మేడ ముంగు నారిక్షా ఆగింది నేను దిగి దిగడం తోనే మేడమెట్లు ఎక్కుతూ పైకి వెళ్ళాను నన్ను చూడగానే అక్కడున్న యువతులంతా ముట్టడి చేశారు

ఇంత నాటిగా వున్న మాట చెప్పడం మీరు 'ఆశ్చర్యపడవచ్చు, అసహ్యించుకో వచ్చు కూడ కాని నావికాజీవితానికి అంకి తమై పోయిన నాకు అంతకంటె గత్యం తరం లేదు వేడిరక్తం ప్రవహించే యీ శరీరంలో వుబికె కోర్కెల్ని ఎంత అణచు కున్నా ఓడ హార్బర్ చేరుకుందంటే తిరుగు బాటు చేస్తాయి ముప్పై సంవత్సరాలు మీదపడ్డా ఒక పెళ్ళి,పెటాకులు లేని యీ జీవితానికి మనిషిలా జీవించడానికి యింత కంటె మరో దారి మాత్రం ఏముంది ?

ఈ నావికాజీవితంలో అప్పుడే పది సంవత్సరాలు గడచిపోయాయి. ఈ పది

సంవత్సరాల్లో ఒక్కొక్క మెట్టు ఎక్కుతుంటూ అప్పటికి ఆఫీసరు కాగలిగాను. డబ్బు పుష్కలంగా వస్తుంది. అయినా వంటరివాణ్ని. రెండు మూడు సంవత్సరాల కోసారి సెలవుపెట్టి యింటికి వస్తే ఒక యింటివాణ్ణి కమ్మని ఒక పట్టాన నన్ను వదిలేవారు కారు. కాని పెళ్ళి చేసుకుని ఏం చేయను? ఈ సంకెళ్లు తగిలించుకుని దేశసంచారాలు చేయనా? స్వేచ్ఛలో నిర్విచారంగా వెళ్లమారిపోయే నా జీవితానికి యీ అనర్థకాన్ని కొనితెచ్చి పెట్టుకోవడం నాకు నచ్చలేదు. ఒక స్త్రీ జీవితాన్ని ఉసురుపెట్టడం నాకు మనసొప్పేది కాదు. అందుకే యీ నావికాజీవితం నన్ను దేశదిమ్మరిగా చేసింది. ఈ జీవితంలోవున్న ఆనందాన్ని, స్వాతంత్ర్యాన్ని చేతులార నాశనంచేసుకోడానికి నా కష్టం లేదు.

యువతులంతా నా చుట్టూ చేరారు. నావికులవద్ద పైగా ఒక ఆఫీసరువద్ద ఏవిధంగా వ్యవహరించవలసిందీ వాళ్ళకు బాగా తెలుసు. స్త్రీలోభాలకు కరువైపోయి జేబులనిండా కరెన్సీనోట్లతో ఆకలి తీర్చుకోడానికి వచ్చే నాబోటి వ్యక్తులను ఏవిధంగా మర్యాదలతో ఆహ్వానించవలసింది వాళ్ళకు క్రొత్త కాదు.

నా చుట్టూ చేరిన యువతుల్ని పరామర్శించడంలో నా చూపు రెండో గదిలో ఓ మూలగా కూర్చున్న ఒక యువతిమీద పడింది. నల్లటి ఆకాశంలో నక్షత్రాలన్నిటికి దూరంగా ధ్రువతారలా మెరిసిపోతున్న ఆమె ఆకర్షణ నన్ను వశం చేసుకుంది. నా అనుభవంలో అంతవరకు తటస్థపడని ఆ సౌందర్యం నన్ను చకితుణ్ణి చేసింది.

నన్నాకర్షించడానికి ప్రయత్నం చేసే ఆ యువతుల్ని తొలగించుకుంటూ రెండో గదిలో కూర్చున్న ఆమెవైపు అడుగులు వేశాను. అందరూ హేళనగా నవ్వారు. ఒకఅమ్మాయి వ్యంగ్యంగా అంది "రాతి విగ్రహానికి పూజ చేస్తారులాగుంది. కాని వరప్రసాదం సంగతో?" అందరూ మరోసారి విరగబడి నవ్వారు.

నేను ఆగి వెనక్కి తిరిగాను. "వరప్రసాదమా? దేవుడే దిగివస్తాడు" అంటూ తిరిగి ఆమెవైపు సాగాను.

ఆమె ఓ మూలగా బల్లమీద కూర్చునుంది. ఆముఖంమీద విషాదరేఖలు స్ఫుటంగా కనిపిస్తున్నాయి. తెల్లటి ఖద్దరు చీర ధరించింది. రెండు చేతులకు రెండేసి సన్నటి బంగారు గాజులున్నాయి. మెడలో సన్నటి బంగారుగొలుసు వ్రేలాడుతుంది. గదిలో వంద కాండిల్ బల్బు వెలుగుతుంది. ఆ కాంతిలో ఆ చేతిమీద పచ్చ పొడిపించిన కమల-సుధాకర్ రెండు పేర్లు స్పష్టంగా కనిపించాయి.

కమల బహుశా ఆమె పేరయి వుండొచ్చు. కాని సుధాకర్? ఆపేరుతో నాకేదో సంబంధమున్నట్లు నేను వులికిపడ్డాను.

సుధాకర్ నా చిన్ననాటి చెలికాడు. ఇద్దరం ఒకేస్కూల్లో చదువుకున్నాం. ఒకే తాలింఖానాలో కసరత్ చేశాం. తరచుగా కుస్తీలు కూడా పట్టేవాళ్లం. కాని పెద్దవాడయింతరువాత పెళ్లిసమస్యమీద తలిదండ్రులతో తగువులాట పెట్టుకుని మా నావికాజీవితానికి వచ్చేశాడు. నాతోపాటు కొంతకాలముండి మరో ఓడకు బదిలీ అయిపోయాడు. అతని ఓడ తరుచుగా మద్రాసు వస్తూ వుండేది.

కాని సుధాకర్ యీ ప్రపంచాన్ని వదిలేసిన సంగతి కూడా నాకు తెలుసు. అంతా సంవత్సరం ఆరుమాసాల సంగతి. అతని ఓడ బొంబాయిరేవులో ఆగింది. ఆ ఓడ నానుకునే మందుసామాను మోసుకుపోతున్న మరో ఓడ వుంది. దీనికి ఏవిధంగా నిప్పంటుకుందో రెండూ దగ్ధమయిపోయాయి. ఆ దుర్ఘటనకు అనేకమంది ఆహుతయిపోయారు. ఆ అభాగ్యుల్లో సుధాకర్ ఒకడు.

కాని ఆ సుందరి చేతిమీది సుధాకర్ నా స్నేహితుడో కాడో నేను నిర్ణయించలేకపోయాను, అప్పటికి నేను తీసుకున్న విస్కీ ప్రభావం చాల దిగజారిపోయింది. ప్రక్కనే వున్న సోఫామీద కూర్చుండిపోయాను.

నా దొకతరహా స్వభావం. ఆర్థిక, సాంఘిక వ్యవస్థలతో నిమిత్తం లేకుండా సమాజంలో స్త్రీజాతి కుండవలసిన గౌరవం, వ్యక్తిత్వంపై నాకు పూజ్యభావం వుంది. స్త్రీత్వంలో పవిత్రత వుందని నేను భావించేవాణ్ణి. ఇదంతా నా తత్వానికి విరుద్ధంగా కనిపించవచ్చు.

నేను పరిచయమున్నట్లు లాలనగా "కమలా" అని పిలిచాను.

ఆమె నిద్రనుంచి మేల్కొన్నట్లు వులికిపడింది. ముఖంమీద చిరునవ్వు చిందులాడింది. ఆమె తలెత్తి కళ్లు తెరిచింది.

"మీరు వచ్చారా?" అంది. ఆమె ముఖం వికసించింది. నేను జవాబివ్వలేదు.

ఇరవై సంవత్సరాల పొంగే యవ్వనంలో ఆ సౌందర్యం- మెరిసే తెల్లటి దేహం ..కాని... కాని అంధురాలు, ఆ కళ్లలో చూపు లేదు. చంద్రబింబానికి గ్రహణం పట్టింది.

తన నాజూకు హస్తాలు ఎత్తి సన్నటి వ్రేళ్లతో నా ముఖాన్ని తడిమింది. నా జుట్టు నిమిరింది. కళ్లు - కంఠం - పెదాలు, వణుకుతూ స్పర్శించింది. పెదలవరకు వచ్చిన ఆమె వ్రేళ్లు ఆగిపోయాయి. ఆమె చిరునవ్వు వెలవించింది. తన చేతుల్ని వడిలో దాచుకుంది. ఒక దీర్ఘనిశ్వాస వదల్తూ "ఎవరు బాబు మీరు? మీరు నా సుధాకర్ కారా?" అంది.

నేను మాట్లాడలేదు. ఆమె గాయాన్ని మళ్ళా రేపానేమో నని బాధపడ్డాను.

"ఇక్కడకు రావడం మీ కిది మొదటి పర్యాయమయివుండాలి. ఇక్కడ కొచ్చే వాళ్లు నాతో వేళాకోళా లాడతారు. గాయంమీద కారం చల్లడం వాళ్ల కెంతో సరదా."

ఆమె కళ్ళలో ముత్యాలు మెరుస్తున్నాయి. చీర చెంగుతో వాటిని ఒత్తుకుంది.

ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. ఆమెను చూస్తుంటే నా మనసంత అదోలా అయిపోయింది. కమల తన చేతిని వెంటనే లాక్కుంది.

"నాపై మీరు చూపే సానుభూతికి నేనెంతో కృతజ్ఞురాల్ని, కాని మీ రెవరయినా నా సుధాకర్మాత్రం కారు. నా సుధాకర్ కాలేరు" ఆమె చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

నేను లేస్తూ "కమలా - చలిగాలి ఎక్కువగా వుంది. టీ త్రాగాలనిపిస్తుంది. త్రాగడానికి మీకూ అభ్యంతరం లేదనుకుంటా" అంటూ జవాబుకు ఎదురుచూడకుండానే క్రిందికి దిగాను. ప్రక్క హోటల్లో రెండు టీ పంపమని చెప్పి పైకి వచ్చేశాను.

టీ వచ్చింది. "కమలా! నేను యిక్కడకు రావడం నిజంగా యిదే తొలిసారి. కాని యిక్కడకు రాగానే ఎందుకో నా కాళ్ళకు సంకెళ్లు పడిపోయాయి. నామీద అనుమానపడొద్దు"

కమల శుష్కించిన నవ్వు నవ్వింది. "మీరు పరాయివాళ్లు. నేను బజారులో కూర్చున్నదాన్ని. అయినా మీరు చూపే సభ్యతను ఆజన్మాంతం కృతజ్ఞత తెల్పుకుంటాను. కాని మీకు ఏ సేవ చేయడానికి తగినదాన్ని కాకపోయాను"

ఆమె అభిమానానికి నాకు నవ్వొచ్చింది. "అటువంటి మాటలు అవసరం మీరు మరిచిపోతే సంతోషిస్తాను. ఒక్క విషయం - సుధాకర్కూ మీకూ ఉన్న సంబంధం ఏమిటో తెల్సుకోవాలని వుంది"

ఆమె వణుకుతున్నట్టు కనిపించింది. నేను లేచి ఆమెమీద రగ్గు కప్పాను.

"నా కేమీ చెప్పకండి. మీ ప్రవర్తన సుధాకర్ని జ్ఞాపకం చేస్తోంది. నా శరీరం

ఎట్లాగో అయిపోతుంది. రెండు సంవత్సరాలక్రితం యిదేరోజున ఆయన ప్రవర్తన కూడ యిలాగే వుంది. ఇవ్వాళ ఎంత మంచి రోజో చూశారూ? అవును ఇదేరోజు— యీ గదిలో నే—యిదేవేళ మొట్టమొదటి సారి పరిచయ మయింది."

మాట కద్దువస్తూ "అప్పుడు మీ కళ్లు బాగుండేవా?" నే నడిగాను.

"అప్పుడు నా కళ్లెంతో ఆరోగ్యంగా వుండేవి. అందరూ అనేవారు కూడా నా కళ్లు అందంగా వుండేవని. నా శరీరాన్ని కూడా చూశారుగా? రెండు సంవత్సరాలక్రితం నా సౌందర్యంమీద ఎంతో గర్వపడేదాన్ని. కాని ఆ సౌందర్యానికి బదులు యీ కళ్లే మిగలివుంటే ”

"మీరు సుధాకర్ సంగతి మాట్లాడుతున్నారు కదూ?"

అవును ఆ రాత్రికూడ యిదేవేళనుకుంటాను. ఆయన తూలుకుంటూ పైకి వచ్చారు. తిన్నగా మీరు కూర్చున్న యీ సోఫామీద వచ్చిపడ్డారు. ఆఅందంలో ఎంత అమాయకత్వం వుందని, ఆసాయంత్రం బాగా త్రాగారేమొ ఆయన కేమాత్రం మతి లేదు."

సుధాకర్ నటనమీద నే నెంతో గర్వపడేవాణ్ణి కాని ఓడజీవితం నాలాగే అతన్నికూడ అద్దెమాలిన ప్రదేశాలకు అలవాటు చేసింది? ఏమో నేను విశ్వసించలేకపోయాను అయితే యీ సుధాకర్ మరొకడ యుండాలన్న ఆలోచన కల్గింది.

"నే నీ యింట్లోకి రావడం అదే క్రొత్త. త్రాగివున్నాడని తెలుసుకుని నేను వారి పోయి దూరంగా నిల్చున్నా. అంతలో ఆయన "చూడండి— నాకు చాల దాహంగా వుంది. కొంత నీళ్లివ్వండి" అన్నారు. ఆ స్వరంలో ఎంతో నమ్రత, నమ్మకం కనిపించింది. భయపడుతూ నే మంచినీళ్ళ గ్లాసు ఆయన కిచ్చాను. నీళ్లు త్రాగి సోఫామీదనే పడుకున్నారు.

"అర్ధరాత్రిగ్గాని ఆయనకు స్పృహ రాలేదు. మిగతా పిల్లలసాయంతో సోఫామీదనుంచి మంచంమీద పడుకోపెట్టాను. నా భయంమాత్రం పోలేదు. నే నట్లాగే సోఫామీద కూర్చున్నా. ఇంతలో కళ్ళు తెరిచి కంగారుపడుతూ లేచి కూర్చున్నారు. నన్ను చూసి ఆశ్చర్యపడ్డట్లు కనిపించారు. గదంతా కలియజూసి తానెక్కడున్నానని నన్నడిగారు. నేను జరిగిన దంతా చెప్పాను. ఆయన లేచి 'క్షమించండి. మిమ్మల్ని చాలా కష్టపెట్టాను. నా స్నేహితులు బ్రాంది త్రాగించి నాతో పరాచకాలాడారు' అంటూ జేబులోంచి రెండు పదిరూపాయల నోట్లు తీసి సోఫాలో పెట్టూ 'నేను వెళ్తున్నాను. క్షమించండి' అన్నారు.

"నా హృదయం చాలా బాధపడింది. పురుషుని అమాయకత్వాన్ని అనువుగా చేసుకుని దోచుకునె నేర్పు నా కింకా అలవడలేదు. ఈ జీవితానికి రాకముందు ఒక గౌరవ కుటుంబంలోని దాన్నే. అందుకే నాలో యింకా సభ్యత పూర్తిగా నశించలేదు. చలిగాలి తీవ్రంగావుంది. ఆయన వంటిమీద కోటుకూడా లేదు. ఆసమయంలో ఆయన వెళ్లటం నా కిష్టంలేదు. ఆ రెండు నోట్లు ఎత్తి ఆయనకు తిరిగి యిచ్చేశాను. ఆయన కూర్చునివుంటే ఆయ న్నట్లాగే చూస్తూ వుండిపోదా మనిపించింది— నిద్రపోతున్నారా?"

"లేదు – లేదు – చెప్పుకురండి"

"వారు చాలా ఖులాసామనిషి. వార్ని ఆపుచేయడానికి అనేక ప్రయత్నాలు చేసినమీద ఆయన 'సరే – వక్కను. నా జీవితంలో ప్రథమంగా యిటువంటి ప్రదేశానికి వచ్చాను. తీరా వచ్చింతరువాత యీ యింటినుంచి అంధకారంలో పోవడమూ, పట్టపగల్లో పోవడమూ రెండూ ఒకటే అనా[illegible]. ఈ నిర్ణయంమీద నా కెంతో సంత[illegible]ం కలిగింది. ఇంతలో వారన్నారు మళ్ళా 'చూడండి! నా కా సోఫా యివ్వండి. మీరి మంచంమీద పడుకోండి అని.

"కాని నా కారాత్రి నిద్రపట్టలేదు. కళ్లు మూతబడగానే అంధకార మావహిస్తుందన్న భయం నాలో కలిగింది. నాకు నిద్రపట్టకపోవడం ఆయన కనిపెట్టారు సిగరెట్టు కాలుస్తూ అన్నారు "మీకు నిద్రపట్టడం లేదనుకుంటా. పోనీ కూర్చోండి. ఏమన్నా కబుర్లు చెప్పుకుందాం"

"అయితే దారిలో పడ్డాడన్నమాట" నానోటంట చటుక్కున వచ్చేసింది.

"లేదు. మీరు అపార్థంచేసుకోవద్దు. వారు సిగరెట్టు పొగ వదల్తూ 'మీ గురించి ఏమీ చెప్పరా' అంటూ అడగ్గానే ఏవిధంగా ఆరుమాసాలక్రితం నా భర్తను, యింటిని వదిలి పారిపోయి వచ్చేసినసంగతి— ఆతర్వాత నాకు తటస్థపడ్డ వివరాలు ఒక్కటీ దాచకుండా— ఎట్లా చెప్పానో నాకే అర్థం కాలేదు. ఆయన మౌనంగా వింటూ కూర్చున్నారు. వారు మొదటిసారి కళ్లెత్తి నా కళ్లల్లోకి చూశారు. ఆ ఒక్క క్షణంలో నా జీవితానికంతా ఒక గాథగా అనిపించారు. వెంటనే తల దించుకుని 'ఈ జీవితం మీకు చాలా యిష్టంగా వుందనుకుంటా' అన్నారు.

"ఆమాటలలోని బాధ, సానుభూతి నాకర్థం గాకపోలేదు. బహుశా నా పడిపోయిన జీవితంమీద విచారపడుతున్న ట్లనిపించింది. నా హృదయం వుబికిపోయింది. నేను మంచంమీదనుంచి దిగి గది కిటికీనుంచి క్రింద బజాలోని అంధకారంలోనాకు నేను మరచిపోడానికి ప్రయత్నించాను.

"నామాటలవల్ల మీకు కష్టం కలిగిందేమో! నా వుద్దేశమది కాదు" అకస్మాత్తుగా మళ్లా అన్నారు.

"కిటికీనుంచి చూస్తున్న నా ముఖాన్ని తిప్పకుండానే అన్నాను. 'నిజమే, మనిషయింతరువాత తప్పులు జరుగుతుంటాయి. కాని స్త్రీ, పురుషులు చేసే తప్పులు విచారించడంలో సమాజం యొక్క న్యాయం భేదిస్తుంది. స్త్రీ తప్పుగాని చేస్తే సమాజాన్ని క్షమాపణ కోరుకోడానికి అనర్హురాలు. ఆమెగురించి మిగిలింది పతితగా వెళ్ళ మారిపోవడమో, లేక మృత్యువుని కోరుకోవడమో. వేశ్యల కొంపల్లోకి ప్రపంచమంతా మోకరిల్లుతుంది. అనుభవించేముందు ఎన్నో వుపదేశాలిస్తుంది. కాని చేరదీసేవాళ్లుమాత్రం ఒక్కరూ కనిపించరు'

"సోఫానుంచి లేచి నా వెనగ్గా నిలబడ్డారు. సిగరెట్టును బూటుతో నలిపి నా భుజాలమీద చెతులు వేసి వారివైపు తిప్పుకున్నారు. కొన్ని క్షణాలవరకు నా ముఖంలో తీక్షణంగా చూస్తూ అన్నారు. 'కమలా పవిత్రమైన మనసుతో పతికీనట్లయితే భగవంతుడు కూడ ల[illegible]స్తాడు. ఈ జీవితాన్ని వదిలిపెట్టారా నేను ఆశ్రయమిస్తాను?'

"నా కంతా కలలా వుంది. వారట్లాగే నా కళ్లల్లోకి గుచ్చిగుచ్చి చూస్తుంటే వారిని చూడలేకపోయాను. ఆ ముఖం గంభీరంగా వుంది. ఏదో భీష్మప్రతిజ్ఞ చేస్తున్నట్లు వారి అధరం కఠినంగా కంపించింది. నాలో నిలబడే శక్తి లేకపోయింది. వారి కాళ్లవద్ద అట్లాగే కూర్చుండిపోయాను. నా కన్నీళ్లు ఎంత నిరోధించినా ఆగలేదు. వారు గంభీరంగా అట్లాగే నిలబడివున్నారు.

'చాల కఠినమైన కార్యం. విశ్వాసంతో ప్రయత్నించండి. బహుశా జీవితంలో జయంపొంద గలగొచ్చు. ఈ పర్యవసానంచూడ్డానికి మళ్లా వస్తాను.' దీనితరువాత వారు ఒక్కక్షణంకూడా ఆగలేదు. కనీసం తిరిగికూడా చూడలేదు. మరుసటి రోజునుండే నాకు జ్వర మ్మొదలయింది. ఆ జ్వరంనుంచి యీరోజువరకూ నాకు విముక్తి లేదు.'

"అత నెవరో తెలుసా మీకు?" నే నడిగాను

"వారు నావికాదళంలో ఒక ఆఫీసరని

మాత్రం తెలుసు. అదీ వారిటోకీ, అదీ చూస్తే అట్లా అనిపించింది' ఆమె మౌనంగా కూర్చుంది.

అయితే అతడు సుధాకర్ అని నేను దృఢపరచుకున్నా, కాలేజీ ప్లాట్‌ఫారంమీద సమాజంయొక్క దురాచారాలు ఏకరువుపెట్టేవాడు. సమాజంలో ప్రత్యేకంగా స్త్రీజాతి పొందే అక్రమాల్ని నిరసిస్తూ వారిని వుద్ధరించే సందేశాలు యివ్వడంలో ఉద్వేగం కనబరిచేవాడు. సంఘంలో స్త్రీకి సమానత్వ ముండాలని అతని విశ్వాసం. నవ్వులాటలో ఒక రోజు "మాటల వుద్రేకానికి, చేతల సాహసానికి చాలా తేడా వుంటుందోయ్" అన్నాను. దీని కతడు వెంటనే సమాధానంకూడా యిచ్చాడు." అటువంటి సమయ మొచ్చినప్పుడు వీడు కేవలం మాటలమీద బ్రతికే వాడు కాడని నీకే తెలుస్తుంది."

కాని యీ సంఘటన చూస్తే అతన్ని పరీక్షించడానికి విధాతే అతన్ని ఇక్కడకు పంపేడేమో ననిపిస్తుంది. కాని యీ పందెంలో గెలుపు పొందకముందే అతను".. ...

"మీ రేదో ఆలోచిస్తున్నారులా గుంది-ఆమె నా ఆలోచన్ని అరికట్టింది. "వారు కూడ మిగతావాళ్లలాగే వచ్చి మజా చేసి వెళ్లిపోయా రని అనుకుని వుంటారు. కాని అట్లా కాదు. వారు మళ్లా వచ్చారు."

మళ్లా వచ్చారా ?" నా కాశ్చర్యం కలిగింది.

"అవును. వచ్చారు. నెల పదిహేను రోజుల తరువాత అంధకారంలో గాకుండా పట్టపగలే వచ్చారు. ఆ రోజే హార్బరులోకి ఓడ వచ్చింది. జ్వరంతో నేను మంచంమీద పడివున్నా, లేచి కూర్చోలేకపోయాను. నా మంచంమీద కూర్చుని లాలనగా అన్నారు. 'ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నట్లు న్నా ది. బంగారం కాలితేనే గాని మేలిమి కాదు. అసలీపరిస్థితి ఎందుకు తెచ్చిపెట్టుకున్నట్లు ?'

"ఆరోజే నన్ను ఆస్పత్రిలో జేర్పించారు. వారి ఓడ యీ హార్బరులో వున్న ఆరురోజులు రాత్రీ, పగలు అనకుండా నా ప్రక్కనే వున్నారు. 'కమలా యివ్వాళే ఓడ కలకత్తా బయల్దేరుతుంది. ఒక్క మాసంలో తిరిగి వస్తాను. ఇంతలో నీవూ బాగుపడతావు. అయినా ఇక్కడే వుండు. నీ ఖర్చునిమిత్తం అన్ని ఏర్పాట్లు చేశాను. తిరిగి రాగానే ఒక్క మాసంపాటు సెలవు తీసుకుని నిన్ను అమ్మదగ్గరకు తీసుకుని వెళ్తాను' అంటూ వందరూపాయల నోట్లు అయిదు నా తలగడక్రింద పెట్టారు. మొదటిసారి ఆప్యాయంగా నా చెదరిన జుట్టును నిమురుతూ ముద్దుపెట్టుకున్నారు. ఆ నోట్లు యింకా అట్లాగే నా పెట్టెలో పడివున్నాయి. వారు నాకు దక్కనప్పుడు వాటిని ఖర్చుపెట్టిమాత్రం ఏం చేయను చెప్పండి ?"

"ఆ తరువాత ?"

"ఆ తరువాత-వా రింతవరకు తిరిగి రాలేదు." ఆమె కళ్లంట నీళ్లు తిరిగాయి.

"ఆస్పత్రిలో నయమయినతరువాత యిక్కడ కొచ్చావన్నమాట"

"ఈ కొంపలో చూచిం తరువాత మీ మాటలో కాఠిన్యత కనిపించడంలో ఆశ్చర్యం లేదు. కళ్లు పోగొట్టుకున్నా, యీ కొంపలోని స్త్రీలతోపాటు నన్ను చలామణీ చేస్తున్నారు. ఇదంతా నా దురదృష్టం. నా సర్వస్వాన్ని ధారపోసినా ఆయన్ని పొందలేకపోయాను. ఆయన వెళ్లిపోయినతరువాత నా జీవితం మారిపోయింది. నా గది తలుపులు ప్రపంచానికి మూత బడిపోయాయి. భుక్తికోసరం పాచిపనులు చేశాను. వంటమనిషి నయ్యాను. పస్తులున్నాను. కాని ఆయన తిరిగి రాలేదు. ఆరుమాసాలు గడిచిపోయినా వారిజాడ లేదు. నా ధైర్యం కూలిపోయింది. ఎన్నో సందేహాలు నాలో సంఘర్షణ చేశాయి. జ్యోతిష్యుల్ని వేడుకున్నాను. దేవాలయాల్లో మొక్కుకున్నాను. కాని ఫలితం దక్కలేదు. నా ఆరోగ్యం చెడిపోయింది. జ్వరం ఓవైపు నన్ను వెంటాడింది. ఏడ్చి ఏడ్చి యీ కళ్లు చూపు పోగొట్టుకున్నాయి. బాగు చేయించుకోడానికి యీ రోజువరకు వారి డబ్బు ముట్టుకోవాలంటె నా మన స్సొప్పదు. ఇప్పుడు యీ యింట్లో వారి దయమీదనే ఆధారపడివున్నా. ఇప్పటికయినా ఆయనకు దయకలిగి యిటు వస్తారేమో నని ఆయనగురించి యింకా ఎదురు చూస్తున్నా. పోనీ ఒక్కసారే కానివ్వండి. వారి క్షేమం వినేంతవరకు నా ప్రాణం పోదు."

నా కళ్లు చెమ్మగిల్లాయి. ఏమనాలో నా నోటంట మాట పెకల్లేదు.

"మీ రెవరో నాకు తెలీదు. ఇంతవర కెవరూ నన్ను చూసి నవ్వకుండా వుండలేకపోయారు. అందరూ నేను పిచ్చిదాన్ననుకుంటారు. వారి రాకకై ఎదురు చూస్తున్న నిజంగా పిచ్చిదాన్ని, గుడ్డిదాన్ని"

ఆమె చేతి వ్రేళ్లు ఆమెమెడలో వ్రేలాడుతున్న లాకెట్‌తో ఆడుకుంటున్నాయి. చివరకు ఆ లాకెట్ విప్పి నాముందు వుంచింది.

"చూడండి ఆయన్ని. నాకు దారి చూపి దారి తప్పారు"

లాకెట్‌లో వుంది సుధాకర్ ఫోటోయే. కమల అన్నట్టే యితరులకి మార్గం చూపి తన మార్గాన్ని పోగొట్టుకున్నాడు.

ఆమె కంతా వినిపించా లనిపించింది. "కమల! మీ తపస్సు విఫలమయిపోయింది. సుధాకర్ యికయీ ప్రపంచంలో లేడు" అనిమాత్రం అనగలిగాను. తరువాత అక్కడ కూర్చోలేకపోయాను. వెనక్కి తిరిగిచూడకుండానే క్రిందకు దిగివచ్చేశాను

నా కా రాత్రంతా నిద్రపట్టలేదు. కమల విషాదజీవితం నా మెదడులో సుళ్లు తిరుగుతోంది. ఉదయం కాగానే నిర్ణయించుకున్నా సెలవుపెట్టి కమలను సుధాకర్ తల్లిదగ్గర దిగపెట్టాలని. ఆ ముసలితల్లి కొడుకుదుఃఖాన్ని యీ కోడలివల్ల మరచిపోవచ్చు.

కాని నా ఆలోచనంతా వ్యర్థమైంది. ఆ రోజు వుదయమే కమల తన ప్రియుణ్ని కలుసుకుంది. ఆమె ముఖంమీద యింకా ఆ చిరునవ్వు ఆడుతూనే వుంది. ఆమె హృదయంమీద వున్న కుడిచేతి గుప్పెటలో సుధాకర్ లాకెట్టు యిమిడిపోయింది.

ఆమె అంతిమ సంస్కారాలు నా చేతులమీదనే జరిగాయి.

అంతా 15 రోజు లయింది. డ్యూటీనుంచి సెలవు తీసుకుని యింటికి వెళ్లాను. వచ్చి పడివున్న వుత్తరాల కట్టలో సుధాకర్ వుత్తరం కూడా ఒక టుంది. రెండో పేజీలో వ్రాశాడు—

".. నీ కో సువార్త వినిపిస్తా. నేను పెళ్లి చేసుకోబోతున్నా. అదీ త్వరలోనే పిల్లను చూచానుకూడా పెద్దింటిపిల్ల కాదు. ధనికుల పిల్లా కాదు. దారి తప్పిన ఒక స్త్రీ. కాని ఆమె మళ్లా దారిచేరుకోడాని కష్టపడుతోంది. ఆమె కాశ్రయ మివ్వడానికి మాటకూడ యిచ్చాను. దీనివల్ల ఆమెకూ-సమాజానికి బహుశా నాకూ కూడా ఉద్ధరణ జరగవచ్చు. .. నా మాటలు జ్ఞాపకమున్నాయా ? ఆ అమ్మాయిపేరు తెలుసుకోవాలని వుందా ? చెప్పమంటావా ? అయితే విను. క-మ-ల. అందంగా లేదూ ? తీయగా లేదూ? నీవే స్వయంగా చూస్తే-నిజంగా నమ్ము, యీర్ష్యతో వుడికిపోతావ్"

మనస్సంతా మరోసారి ఏడ్చింది.

గనోక్యూర్
ఒక్క పెరటితు గంటలలో గుణము
ఈశ్వరఫార్మసీ రాజమండ్రి